కడప : ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

పేదింట ఉడకని కంది పప్పు!

బహిరంగ మార్కెట్‌లో కంది ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లాలోని రేషన్ కార్డుదారులకు ఈ నెలా కందిపప్పు అందని ద్రాక్షగానే మిగిలింది. పేదింట పప్పు ఉడకడం లేదు. తక్కువ ధరకే చౌక ధరల దుకాణాల్లో అందక కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు మార్కెట్లో కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీస్తున్నా అదుపు చేసే వ్యవస్థ లేకపోవడంతో కలవరపడుతున్నారు. ఎందుకా ఈ పరుగు అనే ప్రశ్న సర్వత్రా వినిపిస్తున్నా పాలకుల్లో కాసింతైనా చలనం లేదు.

చౌకదుకాణాల్లో ఆగిన పంపిణీ

రెండు నెలలుగా విడుదల కానివైనం

అందని ద్రాక్షలా కందిపప్పు

బయటి మార్కెట్‌లో రూ.150కి పైగా పలుకుతున్న ధర

చౌకదుకాణాల కందిపప్పుకు పెరిగిన డిమాండ్

సరకుల కోతతో కార్డుదారుల ఆక్రోశం

ప్రజాశక్తి-చాపాడు/రాయచోటి

వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల్లో 2,362 చౌక ధరల దుకాణాలున్నాయి. ఇంటింటికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయడానికి ఎండియు వాహనాలు 676 ఏర్పాటు చేశారు. ఇవి చాలా చోట్ల కదలడం లేదు. పేదలకు చౌక దుకాణాల్లో కంది పప్పు కరువైంది. ఫిబ్రవరి, మార్చి నెలకు సంబంధించి ఇప్పటి వరకు విడుదల కాలేదు. బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేస్తున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో 1,239 రేషన్ షాపుల పరిధిలో 5,78,777 కార్డుదారులు, అన్నమయ్య జిల్లాలో 1,123 రేషన్ షాపుల పరిధిలో 4,98,092 మంది తెల్లరేషన్ కార్డుదారులు ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రతి నెలా తెల్లరేషన్ కార్డులపై బియ్యం ఉచితంగాను, అర కిలో పంచదార రూ.17, కిలో కందిపప్పు రూ.70 చొప్పున సబ్సిడీపై పంపిణీ చేస్తున్న సంగతి తెలిసందే. ఇవన్నీ ప్రతి నెలా 1వ తేదీ నాటికే సివిల్ సప్లైరు గోడౌన్లకు చేరేవి. అక్కడి నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా గ్రామాలకు సరుకులు చేరేవి. వ్యానుల ద్వారా ఇంటింటికీ సరఫరా చేస్తున్న విషయం విధితమే. కంది పప్పు విషయంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి నెలా కొంత శాతం కోత పెడుతోంది. ఫిబ్రవరి, మార్చి నెలలో పూర్తిగా కార్డుదారులకు కంది పప్పు సరఫరా కాలేదు. మార్చి నెలకు సంబంధించి ఉమ్మడి జిల్లాకు ఇప్పటికీ కంది పప్పు చేరలేదు. ఏకంగా కందిపప్పు విడుదల చేయకపోవడంతో పేద, నిరుపేదలు నెలలో ఒక్కపూట కూడా పప్పు అన్నం తినే పరిస్థితి లేదు. కిలో కందిపప్పు ధర బహిరంగ మార్కెట్‌లో రకాన్ని బట్టి రూ.140 నుంచి రూ.160 వరకు పలుకుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు నెలలుగా ఇవ్వలేదని కార్డుదారులు తెలుపుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ నెల కందిపప్పు ఇవ్వలేదన్న విషయాన్ని కార్డుదారులంతా చెబుతున్నారు. గత నెలలో బియ్యం సరఫరాలో కోత విధించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రావడంతో తిరిగి పూర్తి స్థాయిలో పంపిణీ చేశారు. సరుకులు సరిగా ఇవ్వడం లేదన్న ప్రజల వాదనకు తగ్గట్టుగానే రేషన్ సరుకులైన బియ్యం, పంచదార, కందిపప్పు పక్కదారి పడుతున్నాయి. ఉమ్మడి కడప జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక మండలంలో రేషన్ సరుకులు పట్టుబడుతున్నాయి. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ పండగలకు ప్రత్యేకమైన సరుకులు అందించేవారు. డిసెంబర్, జనవరి నెలల్లో జరిగిన ఈ పండగలకు అటువంటి సరుకులు అందుతాయని భావించినప్పటికీ ఆచరణలో అందలేదు. ప్రస్తుతం రంజాన్ నెలలో కూడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదు.ఈసారి నెలవారి ఇచ్చే సరుకుల్లోనూ కందిపప్పు కోత పెట్టడంతో తెల్లరేషన్‌కార్డులు విలవిలాడిపోతున్నారు. ఇలా చౌక ధరల దుకాణాల్లో సరుకులు తగ్గించి, ఇచ్చిన వాటిలో కోత విధించడం, ఈనెల ఏకంగా కందిపప్పు సరఫరాకు ఎగనామం పెట్టడంతో పేదలకు ఆర్థిక భారంగా పరిణమించింది.

రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు

రెండు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదు. జనవరిలో మాత్రం పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో పంపిణీ చేయలేదు. మార్చి నెలకు సంబంధించిన కందిపప్పు ఇంకా రాలేదని రేషన్ విక్రయించే సిబ్బంది చెబుతున్నారు. పప్పు ధర కూడా పెరిగిపోయింది. రూ.140 పెట్టి కొనుగోలు చేయాలంటే ఇబ్బందికరంగా ఉంది. పేదలకు కందిపప్పు కూడా తినలేని పరిస్థితి ఏర్పడింది.

- నాగయ్య, దినసరి కూలీ, గడ్డమాలవాడ, మైదుకూరు.

ఆగి ఉన్న డిఎంయు వాహనం

నిత్యావసర సరుకులు పంపిణీ చేపట్టాలి

ప్రభుత్వం నిత్యావసర సరుకులను కోత విధించకుండా సరఫరా చేపట్టాలి బియ్యం మాత్రం ఉచితంగా పంపిణీ చేస్తూ చక్కర కందిపప్పులో కోత విధిస్తున్నారు. కందిపప్పు రెండు నెలలుగా ఇవ్వడం లేదు మార్కెట్లో కందిపప్పు ధర ఆకాశాన్ని అంటుతున్నది ప్రభుత్వం ప్రతినెల రేషన్ సరుకులను పంపిణీ చేపట్టాలి.

- లక్ష్మణ్ రావు, వెంకటాపురం, చాపాడు.

కంది పప్పు ఇవ్వాలి

ప్రభుత్వం పంపించేస్తున్నా రేషన్ బియ్యంతో పాటు గతంలో కంది బేడలు పంపిణీ చేసేవారు. ప్రస్తుతం కంది బేడలు ఇవ్వడం లేదు. రేషన్ బియ్యం బండి వద్ద వారిని అడిగితే తమకు తెలియదు అని వారు సమాధానం చెబుతున్నారు. రేషన్‌లో ఇచ్చే నిత్యవసర సరుకులను తోనే జీవనం సాగిస్తున్నాం. ప్రభుత్వం వెంటనే రేషన్ బియ్యంతో పాటు కంది బేడలు పంపిణీ చేయాలి.

- ఎ.రెడ్డయ్య ఎగువ అబ్బవరం, రాయచోటి.

బియ్యం ఇచ్చారు..కందిపప్పు ఇవ్వలేదు

ప్రభుత్వం పేదలకు ఉచితంగా బియ్యం అందిస్తూ మంచి పని చేస్తుంది. గతంలో బియ్యంతో పాటు చక్కెర, కంది బేడలు ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు అవుతున్న నేటికీ నిత్యావసరాలతో పాటు కందిబేడలు మాత్రం పేదలకు అందడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి పేదలకు బియ్యంతో పాటు కంది బేడలను ప్రతినెల ఇవ్వాలి.

- డి.శంకరమ్మ, రాయచోటి.

నిర్బంధాలతో ఉద్యమాన్ని ఆపలేరు

-ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-కడప అర్బన్

రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడ కార్యక్రమానికి తరలివెళుతున్న అంగన్వాడీలను హౌస్ అరెస్టు చేయడం, నిర్బంధించడం సరైనది కాదని సిఐటియు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శులు బి.మనోహర్, నాగసుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయడానికి విజయవాడలో నిరసనకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. అయినప్పటికీ జిల్లాలో అంగన్వాడీ వర్కర్స్‌ను పోలీసులు ద్వారా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. అధికారులతో ఇబ్బంది పెట్టడం సరైంకాదని చెప్పారు. అధికారులు, ప్రభుత్వం రూ.26 వేల జీతం పెంచితే ఇలాంటి ఆందోళన చేయాల్సిన అవసరం ఉండదు కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అరెస్టులు మానుకుని జీతం పెంచాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్స్ ఏం జరిగినా ప్రభుత్వానిదే బాధ్యతని తెలిపారు. నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎ.రామ్మోహన్, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి, సిఐటియు నాయకులు నాగేంద్ర పాల్గొన్నారు.

బద్వేలు : బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌డిఒకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు గౌరవ అధ్యక్షురాలు కె.సుభాషిని మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన మహాధర్నా కార్యక్రమాన్ని ప్రభుత్వం అడ్డుకుని అరెస్టులు, నిర్బంధాల ద్వారా అణచివేయాలనుకోవడం దుర్మార్గకరమైన చర్యని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇరుపోతు ఓబులేసు, పట్టణ నాయకులు షేక్ మస్తాన్ షరీఫ్, రూరల్ నాయకులు ముడమాల ఓబుల్‌రెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బద్వేల్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆర్.హుస్సేనమ్మ, ప్రాజెక్టు నాయకులు కళావతి, జయప్రద, రత్నమ్మ, కె.వి.సుభాషిని, విజయమ్మ, వాణి, సరోజ, వసంతమ్మ, లక్ష్మీ నరసమ్మ, శారదా, సుబ్బమ్మ, అనురాధ, సులోచన, లక్షుమ్మ, భారతి, సుధ, ప్రభావతి, సీయోను కుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వం నుంచి రావలసిన వాటి కోసం శాంతియుత పోరాటాలకు పిలుపునిస్తే అక్రమ అరెస్టులు చేయడం సరికాదని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీదేవి భాగ్యమ్మ తెలిపారు. స్థానిక ఐసిడిసి కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ విజయవాడలో మహా ధర్నాను జయప్రదం కోసం వెళ్తా ఉన్న వారిని అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో దేశంలోని శ్రామిక మహిళలకు మరోసారి మోసం చేసిందన్నారు.కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు యేసుదాసు, సిఐటియు ఉపాధ్యక్షులు వినయ్ కుమార్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : సిడిపిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కడపలో హీరోయిన్ కీర్తిసురేష్ సందడి

- ది చెన్నై షాపింగ్ మాల్ ప్రారంభం

అభిమానులకు అభివాదం చేస్తున్న కీర్తిసురేష్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రముఖ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ కడపలో తళుక్కుమన్నారు. సోమవారం కడపలో ది చెన్నై షాపింగ్ మాల్‌ను ఆమె ప్రారంభించారు. హీరోయిన్ కీర్తి సురేష్ కడపకు వస్తున్న విషయం తెలుసుకున్న అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున ది చెన్నై షాపింగ్ మాల్ వద్దకు చేసుకున్నారు. సినిమా పాటకు ఆమె డ్యాన్స్ చేసి ప్రేక్షకులను ఉర్రూతలూగించారు. కీర్తి సురేష్ ది చెన్నై షాపింగ్ మాల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. కడపలో 28వ షాపును ఆమె ప్రారంభించారు. హీరోయిన్ రాక సందర్భంగా చిన్నచౌక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిఐ ఓబులేసు, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి, ఎఎస్ఐ సుబ్బరాజు, సిబ్బంది ఆమె వ్యక్తగత బాడీ గార్డులు రక్షణగా నిలించారు. కార్యక్రమంలో చెన్నై షాపింగ్ మాల్ చైర్మన్ మర్రి జనార్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మర్రి వెంకటరెడ్డి, యాజమాన్య ప్రతినిధులు జమున రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 403 మంది గైర్హాజర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం మ్యాథ్స్-2బి, జువాలజి, హిస్టరీ పరీక్షలు నిర్వహించారు. రెగ్యులర్ అభ్యర్థులు 11,662 మంది హాజరు కావాల్సి ఉండగా 11,317 మంది హాజరయ్యారు. 345 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సకు సంబంధించి 1,089 మంది హాజరు కావాల్సి ఉండగా 1,031 మంది హాజరయ్యారు. 58 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 12,751 మంది హాజరు కావాల్సి ఉండగా 12,348 మంది హాజరయ్యారు. 403 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసులు నమోదు కాలేదు. 97శాతం హాజరు నమోదైంది.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన నెడ్‌కాప్ అధికారి

ప్రజాశక్తి-కడప అర్బన్

కడప నెడ్‌కాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ టి.యల్లారెడ్డి సోమవారం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు సి.పి.బ్రౌన్ సేవలను, గ్రంథాలయ నిర్మాణం, నిర్వహణకు జానమద్ది హనుమచ్ఛాస్త్రి చేసిన కృషిని వివరించారు. పరిశోధన కేంద్రంలోని తాళపత్ర గ్రంథాలను, తామ్రపత్రాన్ని, చేతితో తయారు చేసిన కాగితాలను చూసి టి.యల్లారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకటరమణ, సిబ్బంది హరి పాల్గొన్నారు.

ఎంఎస్‌సి మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగామినేషన్ ఆచార్య కెఎస్వీ కృష్ణారావు, డీన్ ఆచార్య ఎ.జి.దాముతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఆచార్య రఘునాథరెడ్డి మాట్లాడుతూ జనవరిలో నిర్వహించిన ఈ పరీక్షల ఫలితాలు త్వరితగతిన విడుదలకు కృషిచేసిన పరీక్షల విభాగాన్ని అభినందించారు. బోటని, బయోకెమిస్ట్రీ, జియాలజి, మైక్రోబయాలజి, ఫిజిక్స్ ఎన్విరాన్మెంటల్ సైన్సు, జెనెటిక్స్ అండ్ జీనోమిక్స్ కాంపుటేషనల్ డేటా సైన్స్ కోర్సుల లో వందశాతం ఉత్తీర?త లభించిందన్నారు. మ్యాథమ్యాటిక్స్ 75 శాతం, ఫుడ్ టెక్నాలజి 95 శాతం, జువాలజి 96.43 శాతం, కంప్యూటర్ సైన్స్ 68శాతం, బయోటెక్నాలజి 97.62 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం https:www.yvuexams.in/results.aspx అనే వెబ్సైట్ ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ సహాయ అధికారులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ మమతా కుమారి పాల్గొన్నారు.

పెద్దదర్గాను దర్శించుకున్న జబర్దస్త్ వేణు

ప్రజాశక్తి-కడప అర్బన్ : ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కడప అమీన్ పీర్ దర్గాను సినీ నటుడు, దర్శకుడు, జబర్దస్త్ వేణు సందర్శించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాను సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం చూపాలి : జెసి

అర్జీదారులతో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న జెసి అదితి సింగ్

ప్రజాశక్తి-కడప

ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారినే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పిజిఆర్ఎస్ దరకాస్తులపై ఆయా జిల్లా అధికారులతో సమీక్షించారు. ఖాజీపేట నండిపాడుకు చెందిన లింగారెడ్డి రవనమ్మ ఎన్టీఆర్ వితంతు పెన్షన్ మంజూరు చేయాలని అభ్యర్తించారు. చింతకొమ్మదిన్నె మండలం అంగడి వీధికి చెందిన వి.ఆర్. శుభాషనమ్మ తన భర్త ఎపిఎస్ ఆర్టీసీలో పనిచేస్తూ 1999 సంవత్సరం మరణించారని, కారుణ్య నియామకం కింద పిల్లలకు ఉద్యోగం మంజూరు చేయాలని కోరారు. కాశినాయన మండలం వారికుంట్ల గ్రామానికి చెందిన పి.నాగమ్మ సర్వే నెం.140లో 0.40 సెంట్లు స్థలం కలదని, అందులో తన ఇంటి స్థలం కు సర్వే చేయించి హద్దులు చూపే వరకు పక్కవారు నిర్మాణం నిలుపుదల చేయించాలని అభ్యర్తించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, కిరణ్ కుమార్, ఎస్‌డిసి వెంకటపతి, శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎన్‌జిఒ నాయకులు

'అమనగంటి' సేవలు చిరస్మరణీయం

- ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎపిఎన్‌జిఒ సంఘం వ్యవస్థాపకులు, అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య వ్యస్థాపకులు, శాసన సభ్యులు, శాసనమండలి సభ్యులుగా పనిచేసి ఉద్యోగుల హక్కులకోసం జీవితకాలంపోరాడిన అమనగంటి శ్రీరాములు సేవలు మరువలేనివని ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం 104వ జయంతిని పురస్కరించుకుని ఎన్‌జిఒ హోంలో వైఎస్ఆర్ కడప జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, కార్యదర్శి డి.రవి కుమార్ ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కోశాధికారి నిత్యపూజయ్య, సహ అధ్యక్షులు టి.తిమ్మా రెడ్డి, నాయకులు బాలపుల్లయ్య, వెంగలరావు,యన్. రాజశేఖర్,సిటీ నాయకులు నాగార్జున, మోహనరెడ్డి, హిరామియా, విమెన్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నిర్మల జోతి, కన్వీనర్ భారతి, కృష్ణకుమారి, జానకి అరుణ, హర్ష వర్ధన్ రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎపిజిబిని కడపలోనే కొనసాగించాలి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని రూరల్ బ్యాంకుల విలీనం తర్వాత కూడా కడపలోనే కొనసాగించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను వైసిపి లోక్‌సభాపక్ష నేత పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర ఆర్థిక మంత్రికి లేఖ రాశారు. ఈ సందర్భంగా రాయలసీమ ఇంటలెక్చువల్స్ ఫోరం, రాయలసీమ అభివృద్ధి వేదిక, సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీలు కోరుతున్నట్టుగా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని రాష్ట్రంలో మరో మూడు గ్రామీణ బ్యాంకులతో విలీనం తర్వాత కూడా కడపలో ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించడం న్యాయమని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతంలో పనిచేస్తున్న ఎపిజిబి మౌలిక వసతులు, రిజర్వులు, ఎక్కువ బ్రాంచ్‌లు, మంచి పనితీరు, దక్షిణ భారతదేశంలోనే క్యాష్ చెస్ట్ సౌకర్యం ఉన్న ఒకే ఒక్క బ్యాంకు ఇలా ఏ కొలమానంతో చూసినా గొప్పగా పనిచేస్తున్నదన్నారు. ఎపిజిబి బ్యాంకుకు ఉన్న టెక్నాలజీ రీతులపై పట్టు దృష్టిలో పెట్టుకున్నప్పుడు, కడప సరైన కేంద్రంగా రాష్ట్ర స్థాయిలో సేవలందించగలుగుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాలకు, రైతాంగానికి, చిన్న పరిశ్రమలకు, చిన్న వ్యాపారాలకు ఇలా లక్షిత వర్గాలకు సేవలందించే గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కూడా అలాంటి వాతావరణం ఉన్న కడపలోనే ఉండడం న్యాయమని అన్నారు. ఈ దిశగా కేంద్ర ఆర్థిక శాఖ తక్షణం నిర్ణయం తీసుకోవాలని కోరారు.

వైవీయూలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన యూనివర్శిటీ కళాశాల జాతీయ సేవా పథకం, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు,యూనివర్శిటీ ఆఫ్ యోగీ ఫౌండేషన్‌తో కలిసి మంగళవారం వైవీయూ ఆరోగ్యకేంద్రంలో "రక్తదాన శిబిరాన్ని" నిర్వహిస్తున్నట్లు ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డా.పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, అకడమిక్ కన్సల్టెంట్స్, రీసెర్చ్ స్కాలర్స్, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయాలని పేర్కొన్నారు.

వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలి

- ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులు నిరసన

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌టిసిలో పని చేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులు, కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న ఇపిఎఫ్ పెన్షన్ దార్లకు నెలకు రూ.వెయ్యి, రూ.1,400, రూ.2వేలు పెన్షన్ మాత్రమే వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని ఎపిఎస్‌ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజియన్ కార్యదర్శి వై.రవీంద్రనాథవర్మ కోరారు. సోమవారం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు బి.సి.సుబ్బారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాజారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కనీస పెన్షన్ రూ.7,500లకు పెంచాలని అనేక ఉద్యమాలు చేస్తున్నామని పేర్కొన్నారు. రిటైర్డ్ అయిన ఆర్‌టిసి ఉద్యోగులకు ఎటువంటి పరిమితులు లేకుండా సామాజిక వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. చాలీచాలని పెన్షన్‌తో భార్యభర్తలు జీవనం సాగించలేకపోతున్నారని చెప్పారు. చిన్న, చిన్న పనులు చేసుకుంటూ దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులు

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

- ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌పి ఇ.జి.అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కానారేన్స్ హాలులో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో జిల్లా నలు మూలల నుంచి విచ్చేసిన ఫిర్యాదుదారులతో ఎస్‌పి స్వయంగా మాట్లాడి, వారి సమస్యను విని, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేసి, వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిరీ?త సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులకు సిబ్బంది సహాయం చేసి ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీం, మహిళా పిఎస్ డిఎస్‌పి రమాకాంత్ పాల్గొన్నారు.

సిబ్బందికి 3 నెలల వేతనాలు ఇవ్వాలి

- జెసికి సిఐటియు నాయకుల వినతి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రొద్దుటూరు ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, కమిటీ సభ్యులు సత్యం కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెసి అదితి సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా కట్టం లేదని పేర్కొన్నారు. అడిగితే తొలగిస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. జిఒ నంబరు 549 ప్రకారం కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటినిపై విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. గాంధీరోడ్డులో ఉన్న కార్తీయ నర్సింగ్ హోం డాక్టర్ నాగలక్ష్మి రోడ్డుమీద జనరేటర్ పెట్టి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని తెలిపారు. వీటిపై విచారణ చేసి రోడ్డు మీద జనరేటర్ తొలగించాలని కోరారు. ఎస్‌టి రెసిడెన్సియల్ లో పని చేస్తున్న సెక్యూరిటీలకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల వేతనాలు చెల్లించాలని కోరారు. వీరికి రూ.7,500 నుంచి రూ.8,500 మించి వేతనాలు రావడం లేదని చెప్పారు. కనీస వేతనం రూ.16వేలు ఇచ్చి పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. ఏజెన్సీపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సెక్యూరిటీ, శానిటేషన్ పని చేస్తున్న వారికి 3 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ, పిఎఫ్ చెల్లించాలని కోరారు.



జెసికి వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు మనోహర్, సత్యం

రిలే నిరాహార దీక్ష చేస్తున్న వెటర్నరీ జూనియర్ డాక్టర్లు

ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్టయిఫండ్ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని, లేకుంటే సమ్మె ఉధృతం చేస్తామని వెటర్నరీ జూనియర్ డాక్టర్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక రూరల్ పరిధిలోని గోపవరం పంచాయతీ వెటర్నరీ కళాశాలలో వారు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 36వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లోని వెటర్నరీ జూనియర్ డాక్టర్లకు రూ.14 వేల నుండి రూ.24వేల వరకు స్టయిఫండ్ వస్తుందన్నారు. ఇక్కడ 12ఏళ్ల నుంచి స్టయిఫండ్‌ను సవరించలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వెటర్నరీ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

వేసవి కాలం ప్రారంభమై ఎండలు ముదురుతున్న నేపథ్యంలో పాదచారులు, పట్టణ ప్రజల దాహం తీర్చేందుకు మైదుకూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సోమవారం చలివేంద్రం ప్రారంభించారు. రాజాల యల్లయ్య జ్ఞాపకార్థంతో నేస్తం సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. టిడిపి యువ నాయకులు ఎపి రవీంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రం ఏర్పాటు చేసిన నేస్తం సేవా సంస్థ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నేస్తం సేవా సంస్థ సభ్యులు కొండారెడ్డి, విక్రమ్, ఆదినారాయణ రెడ్డి, సుబ్బారావు, సుబ్బరామిరెడ్డి, సుబ్బారాయుడు, చిరంజీవి పాల్గొన్నారు.

నేడు 'వాగ్దేవి'కి డాక్టర్ ఖాదర్‌వలి రాక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక వాగ్దేవి ఇంజినీరింగ్ కళాశాలకు మంగళవారం కృషిరత్న, పద్మ శ్రీ పురస్కార గ్రహీత, స్వతంత్ర ఆహార ఆరోగ్య శాస్త్రవేత్త, మిల్లెట్ మ్యాన్ అఫ్ ఇండియా డాక్టర్ ఖాదర్‌వలి రానున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.సిద్దేశ్వర రావు తెలిపారు. 'సిరి ధాన్యాలే సంపూర్ణ ఆరోగ్యం–ఈ ఒకే ఒక్క మార్పుతో నూరేళ్ల ఆరోగ్యం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ జి.హుస్సేన్‌రెడ్డి కోరారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రక్తదానం.. మరొకరికి ప్రాణదానమని ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ రవి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సురక్ష బ్లడ్ బ్యాంకు వారు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బి.టెక్, ఎంబిఎ విద్యార్థులు 110 మంది రక్తదానం చేసినట్లు తెలిపారు. అన్నదానం కడుపు నింపితే.. రక్తదానం ప్రాణాన్ని నిలుపుతుందన్నారు. పురుషులు ప్రతి మూడు నెలలకోసారి, మహిళలు ప్రతి నాలుగు నెలలకొసారి రక్తదానం చేయవచ్చన్నారు. కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, హెచ్ఒడిలు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

రోడ్డు భద్రతా నియమాల్లో భాగంగా బైక్‌లో వెళ్లేవారు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీట్‌బెల్ట్ తప్పక ధరించాలని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి పాత బస్టాండ్ వరకు పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం విశ్రాంత అధ్యాపకులు డాక్టర్ బూచూపల్లి పుల్లారెడ్డి యముడి వేషధారణలో వినూత్న రీతిలో హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా ప్రమాణాలను పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్షార్హులు అన్నారు. రహదారి నియమాలను పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు లైసెన్స్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ, హెూం గార్డ్ రంగనాయకులు పాల్గొన్నారు.

'దాల్మియా' సమస్యను పరిష్కరించండి

- దుగ్గనపల్లె గ్రామ ప్రజల వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న దుగ్గనపల్లె ప్రజలు

దాల్మియా పరిశ్రమ నుంచి దుగ్గనపల్లె గ్రామ ప్రజలకు, పంట పొలాలకు పరిష్కారం చూపాలని ఆ గ్రామ ప్రజలు ఆర్‌డిఒ సాయిశ్రీని కోరారు. ఆ మేరకు సోమవారం పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఆర్‌డిఒను మైలవరం మండలం దుగ్గనపల్లె గ్రామ ప్రజలు కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి దగ్గరలోని దాల్మియా సిమెంట్ పరిశ్రమ నుండి వచ్చే దుమ్ము వల్ల తమ పంటల దిగుబడి తగ్గిందన్నారు. ఫ్యాక్టరీ నుండి వచ్చే దుమ్ము, దూళి వల్ల గ్రామ ప్రజలకు అనారోగ్య సమస్యలు ఏర్పడు తున్నాయని తెలిపారు. ఇటు పంట రాక, అటు గిట్టుబాటు ధర లేక ఆత్మహ త్యలు చేసుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు ఆర్‌డిఒ స్పందిస్తూ స్వయంగా గ్రామానికి వచ్చి సమస్యలపై పరిశీలిస్తానని వారికి హామీ ఇచ్చారు.

క్రైం కార్నర్

నెర్రవాడలో ఘర్షణ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నెర్రవాడ గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొగ్గి శ్రీదేవి, వెంకటరమణ మధ్య ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఘర్షణ జరిగింది. శ్రీదేవి చేయికి, వెంకటరమణ తలకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇరువర్గాలకు చెందిన పలువురిపై అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. పూర్తి వివరాల కోసం చాపాడు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ట్రైనీ డిఎస్‌పి భవాని, ఎస్ఐ విచారిస్తున్నారు.

అరటి ధరలు పతనం.. రైతులకు నష్టం

సగానికి పడిపోయిన ధరలు.. బయటి మార్కెట్‌లో టన్ను ధర రూ.40 వేలు.. రైతులకు టన్నుకు చెల్లించేది రూ.12 వేలే

ప్రజాశక్తి - ఖాజీపేట

సాగులో ఉన్న అరటిపంట

ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు నష్టాలు తప్పడం లేదు. మండలంలో అధికంగా రైతులు ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు. దుంపలగట్టు, కొత్తపేట, కొత్త నెల్లూరు, కూనవారి పల్లి తదితర ప్రాంతాల్లో రైతులు ఎక్కువగా ఉద్యాన పంటను సాగు చేస్తున్నారు. అరటి, పూలతోటలు రైతులు సాగు చేస్తుంటారు. ప్రతి ఏడాదిలాగే ఇప్పుడు కూడా అధిక ఆదాయం పొందవచ్చన్న రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పంట ఉత్పత్తులకు సరైన ధరలు లేకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని అన్నదాతలు వాపోతున్నారు. ఖాజీపేట మండలంలో అరటి పంటను సాగు చేసిన రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. మొన్న నిన్నటి వరకు అరటి ధరలు ఆశాజనకంగా ఉండేవి. టన్ను రూ.24 వేల వరకు ఉండడంతో అన్నదాతల్లో ఆనందం ఉండేది. పంట చేతికొచ్చిన తర్వాత ధరలు అమాంతంగా తగ్గిపోవడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టన్ను రూ.12 వేల వరకు మార్కెట్లో నడుస్తోంది. ఒక్కసారిగా ధరలు సగానికి సగం పడిపోవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. బహిరంగ మార్కెట్లో డజన్ రూ.30 నుంచి రూ.40 వరకు అమ్ముతున్నారు. ఈ లెక్కన టన్ను ధర రూ.40 వేల వరకు పలకాలని రైతులు అంటున్నారు. అరటి వ్యాపారులు సిండికేటుగా ఏర్పడి ఒకే ధర నిర్ణయించడంతో తాము నష్టపోతున్నామన్నారు. దళారులు, వ్యాపారులు మాత్రమే ఆదాయం పొందుతున్నారని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. జిల్లాలో అధికంగా సాగయ్యే అరటి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంది. మన జిల్లాలో సాగు అయ్యే అరటికి మంచి ధరతోపాటు నాణ్యత బాగుండడంతో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఉద్యాన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం, మార్కెటింగ్ శాఖ అధికారులు విఫలమయ్యారని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఒక్క ఎకరా అరటి పంటను సాగు చేయాలంటే రూ.లక్ష పైబడి పెట్టుబడి అవుతుందని, దిగుబడి అంతంత మాత్రంగా ఉండటంతో పాటు ధరలు ఒక్కసారిగా అమాంతంగా దళారులు తగ్గిస్తుండడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని కన్నీటి పర్యంతమవుతున్నారు. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసి, రైతులకు మార్కెటింగ్ శాఖ ద్వారా పంట ఉత్పత్తులు సులభంగా అమ్ముకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యాన పంటల సాగుచేసే రైతులు కోరుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాల్లో పైబడి అరటిపంటను సాగు చేశారు. మొన్న నిన్నటి వరకు పూల ధరలు ఆశాజనకంగా ఉండగా నేడు ధరలు తగ్గ ముఖం పట్టాయని పండగలు, శుభకార్యాలు లేకపోవడంతో పూలకు డిమాండ్ తగ్గిందని పూల రైతులు సైతం ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉద్యాన రైతులను ఆదుకు నేందుకు, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి

గర్భిణులకు కూరగాయలు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ముద్దనూరు

గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ఆహారాన్ని తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు నాగార్జున సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఒ వెంకట కృష్ణారెడ్డి, ప్రకృతి వ్యవసాయ న్యాచురల్ ఫామింగ్ అసిస్టెంట్ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన ఎరువులతో సాగు చేసి పండించిన ఉత్పత్తులు ఆరోగ్యానికి మంచిదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ప్రతి నెల 9న ఆస్పత్రి ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తమ సొంత పొలాల్లో సాగు చేసి పండించిన ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలు కొనుగోలు చేసేందుకు సాధారణ ధరలకే అందుబాటులో ఉంచుతారని తెలిపారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు ప్రకృతి వ్యవసాయ కూరగాయలు, ఆకు కూరలు అందించారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభారాణి, ప్రకృతి వ్యవసాయ డివిజన్ మోడల్ మేకర్ నుజహత్, సిబ్బంది రామసుధ, మునిభూపాలుడు, శిక్షణా ఎన్ఎఫ్ఎ మేరీ, వివిధ గ్రామాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

కొండాపురం : పౌష్టికాహారం తప్పక తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు వైద్యులు సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు ఏడాదిన్నర కాలంగా ప్రతినెలా 'రెడ్డి వెల్ఫేర్ సొసైటీ' వారు పౌష్టికాహార భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం లోకనాథరెడ్డి, కేతన్‌రెడ్డి ఆర్థికసాయంతో గర్భిణులు, బాలింతలతోపాటు ఆశాలు, సాధారణ రోగులకు, ఆస్పత్రి సిబ్బందికి పౌష్టికాహారం ఏర్పాటు చేశారు. రెడ్డి వెల్ఫేర్ సొసైటీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆలమూరు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ కార్యక్రమానికి ఆర్థికసాయం అందించిన వారికి, కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ జాతీయ అధ్యక్షుడు ఒంటెద్దు రామలింగారెడ్డి మాట్లాడుతూ వీరిరువురూ సమాజసేవ కార్యక్రమాల్లో ముందుండే వ్యక్తులని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుజాత, డాక్టర్ సాంబశివారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నారాయణరెడ్డి, రెడ్డి సంఘము నాయకులు పాల్గొన్నారు.

అన్నం వడ్డిస్తున్న సొసైటీ సభ్యులు

'గోకులాలకు' అందని బిల్లులు

గోకులం షెడ్డు

ప్రజాశక్తి - వేముల

పశుపోషకులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు గోకులం షెడ్లను మంజూరు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా వీటిని అమలు చేసింది. మండల కేంద్రంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రభుత్వం చేపట్టిన షెడ్లను పశుపోషకులకు ఊతం ఇచ్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం గోకులం షెడ్లను అమలు ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గోకులం షెడ్లను లబ్ధిదారులకు కూడా అంతే ఆసక్తితో గోకులం షెడ్లను నిర్మించుకున్నారు. ప్రభుత్వ రాయితీని అందిపుచ్చుకుంటూ రైతులు షెడ్లు నిర్మించుకున్నప్పటికీ.. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని సంబంధిత అధికారులను లబ్ధిదారులు కోరుతున్నారు. నెలలు గడుస్తున్నా బిల్లులు పూర్తి స్థాయిలో అందలేదని వాపోతున్నారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ 90 శాతం రాయితీతో గోకులం షెడ్లను మంజూరు చేసి నిధులను ఖర్చు చేసింది. కేవలం 10 శాతం ఖర్చు మాత్రమే రైతు పెట్టుబడి. గోకులం షెడ్లను నిర్మించుకునేటప్పుడు అందుకు అయ్యే మొత్తం ఖర్చు పెట్టుబడి పెట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి 90 శాతం రాయితీ రూపంలో రావలసిన బిల్లులు ఇంకా రైతుల ఖాతాలో జమ కాలేదు. దీనిపై మండల ఇన్‌ఛార్జి ఎపిఒగా విధుల్లో ఉన్న ఇసి మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా.. మూడు నెలల క్రితమే గోకులం షెడ్లకు సంబంధించి బిల్లులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే నేరుగా సంబంధిత రైతుల ఖాతాలో జమ అవుతుందన్నారు.

దోబీఘాట్లు లేక రజకుల ఇక్కట్లు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని చాలా గ్రామాల్లో దోబీఘాట్‌లేక రజకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ముఖ్యంగా వేసవికాలంలో వారి కష్టాలు వర్ణనాతీతం. రజకులు పెన్నా, కుందూ, కెసి కాలువ, వంకల్లో వృత్తిని కొనసాగించే పరిస్థితి. అయ్యవారిపల్లి వద్ద అందుబాటులో ఉన్న దోబీఘాట్‌తో కొంత గ్రామ పరిధిలోని రజకులకు కాస్త ఊరటగా ఉంది. మిగిలిన గ్రామాలలో దోబీఘాట్‌లను ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి కోరుతున్నా స్పందన లేదు. గతంలో బిసి కార్పొరేషన్ ద్వారా బోరు వేసి దోబీఘాట్‌లకు గదులు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం వాటి నిర్మాణ ఊసేలేదు. ఈ నేపథ్యంలో ఎక్కువగా కుందూ నది, కెసి కాలువ నీటిపై రజకులు ఆధారపడాల్సి వస్తోంది. తద్వారా నీరు అధికంగా వచ్చినప్పుడు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. ఉతికిన దుస్తులు ఆరబెట్టేందుకు కూడా నదిలో సమస్యగా ఉంది. వంకల్లో దుస్తులు ఉతికిన తర్వాత రోడ్లపైన ఆర పెట్టాల్సిన పరిస్థితి వస్తోందని రజకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాపాడు, సీతారామపురం, శ్రీరాములపేట, అన్నవరం, మడూరు గ్రామాల వద్ద కుందూ నదిలో దోబీలు దుస్తులు ఉతుకుతున్నారు. మొర్రాయపల్లి, సోమాపురం, సిద్ధారెడ్డిపల్లి, బద్రిపల్లి, లక్ష్మీపేట గ్రామాల రజకులు కెసి కాలువ పరిధిలో కాలం గడుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోబీఘాట్‌ల ఏర్పాటు చేసి తమ సమస్యలను పరిష్కరించాలని రజకులు కోరుతున్నారు.

కుందూనదిలో వృత్తి చేసుకుంటున్న రజకులు

పిల్లల్ని కనమని చంద్రబాబు చెప్పడం విడ్డూరం : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

ఎక్కువ మంది పిల్లల్ని కనమని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెప్పడం విడ్డూరం, హాస్యాస్పదమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే ప్రపంచంలో అధిక జనాభా ఉన్న దేశాల్లో భారతదేశానిది మొదటి స్థానమన్నారు. ప్రపంచంలో 242 దేశాలున్నాయన్నారు. ప్రపంచ జనాభా 809 కోట్లు ఉందన్నారు. ఇందులో మన దేశ జనాభా 144 కోట్లు అన్నారు. చైనా జనాభా 142 కోట్లు, అమెరికా జనాభా 34 కోట్లు ఉందన్నారు. ప్రపంచ జనాభాలో 18 శాతం మన దేశంలో ఉందన్నారు. ప్రపంచ విస్తీర్ణంలో మన దేశం 2.41 శాతం మాత్రమే అన్నారు. జన సాంద్రత కూడా మన దేశంలో ఎక్కువ అన్నారు. ఉన్న యువతకే ఉద్యోగాలు, ఉపాధి దొరకడం లేదని విమర్శించారు. మద్యం, డ్రగ్స్, గంజాయికి బానిసలై యువత తల్లిదండ్రులకు భారమై అసాంఘిక శక్తులుగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించాలని కోరారు. అంతవరకు నిరుద్యోగభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉన్న యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించే లేరు గానీ.. ఎక్కువ మంది పిల్లల్ని కానాలని చెప్పడం శోచనీయమని తులసిరెడ్డి పేర్కొన్నారు.

అసంపూర్తిగా ఉన్న రోడ్డు

రోడ్డు అభివృద్ధికి అడ్డంకులు

- రెవెన్యూ, పోలీసు శాఖలతో పరిష్కరిస్తాం : ఎఇ

ప్రజాశక్తి - వేముల

వేముల మండల కేంద్రం నుంచి గొల్లల గూడూరు, చింతల జూటురుపై గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి ఉన్న గుంతలను పూడ్చేందుకు ఆర్అండ్‌బి అధికారులు గుంతలులేని రహదారులు కార్యక్రమంలో భాగంగా ప్రయత్నిస్తుండగా.. గొందిపల్లి గ్రామానికి చెందిన రైతులు మాచుపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి, మాచుపల్లె దివాకర్‌రెడ్డి అడ్డకుంటున్నారని ఆర్అండ్‌బి మండల అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గణేష్‌రెడ్డి తెలిపారు. ఉన్న రోడ్డుపై గుంతలు మాత్రమే పూడుస్తున్నామని, రైతులు మాత్రం ఈ రహదారి మొత్తం తమ పొలంలో వేశారని భూమి సర్వే చేసే వరకు పనులు చేయనీయబోమని మూడు నెలలగా పనులు అడ్డుకుంటున్నారని తెలిపారు. సమస్య పరిష్కారానికి వారితో మాట్లాడితే వారు తనపైనే వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని ఆరోపించారు. రాజకీయ దురుద్దేశాలతో అధికారులతోనే ఇలా మాట్లాడుతున్నారని, విధి నిర్వహణను కూడా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీన్ని అధికారులు తెలిపానని అన్నారు. ఎన్నో ఏళ్ల క్రితం వేసిన రోడ్డును ఈరోజు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రయాణికులు పేర్కొంటున్నారు. రోడ్డు పనులు అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. సమస్యను రెవెన్యూ, పోలీస్ వారితో కలిసి పరిష్కరిస్తామని ఎఇ గణేష్ రెడ్డి స్థానికులకు, ప్రయాణికులకు, రైతులకు తెలిపారు.

సన్మానం పొందుతున్న శ్రీవివేకానంద హై స్కూల్ విద్యార్థులు

శ్రీవివేకానంద విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఎఐఎంఎస్ ఒలంపియాడ్ హంట్ పరీక్షలో శ్రీవివేకానంద విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఎఐఎంఎస్ ఒలంపియాడ్ హంట్ పరీక్షలు కడపలో ఇటీవల నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆదివారం సన్మానించారని తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు హిమజ జాతీయస్థాయిలో 8వ ర్యాంకు, జస్మిత రెడ్డి రాష్ట్రస్థాయిలో 10 ర్యాంకు, మహమ్మద్ సజన జోనల్ స్థాయిలో ఒకటవ ర్యాంకు సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి, పాఠశాల డైరెక్టర్ జాఫర్ సాహెబ్, ప్రధానోపాధ్యాయురాలు షహనాజ్ బేగం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

కల్యాణమండపాన్ని ప్రారంభించిన భూపేష్‌రెడ్డి, ఆర్యవైశ్యులు

ఆర్యవైశ్యులు అభినందనీయులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఆర్యవైశ్యులు సేవా గుణం కలవారని, అభినందనీయులని టిడిపి జమ్మలమడుగు ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కల్యాణ మండపాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం భూపేష్ రెడ్డి మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా కల్యాణమండపాన్ని నిర్మించారని ప్రశంసించారు. స్థానిక మహా అంకాలమ్మ తల్లి ఆలయాన్ని భూపేష్ రెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యులు నాగేష్, అశోక్, సుదర్శన్, కైలాస్, సుమన్, మెడికల్ స్టోర్ నాగేంద్ర, టిడిపి నాయకులు కె.శ్రీనివాసులరెడ్డి, బయపురెడ్డి, కత్తి ప్రతాపరెడ్డి, సంజీవరెడ్డి, తుపాకుల పవన్‌కుమార్ రెడ్డి, రవిరెడ్డి పాల్గొన్నారు.

నేటి మహిళలకు సావిత్రి బాయి పూలే ఆదర్శం

- పూలే వర్ధంతి సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సావిత్రిబాయి పూలే నేటి మహిళలకు ఆదర్శమూర్తి అని, స్త్రీ విద్య అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక కోటిరెడ్డి ఉమెన్స్ డిగ్రీ కాలేజీలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో మహిళలకు మొదటి పాఠశాల నిర్మించిన గొప్ప వ్యక్తి పూలే అని ప్రశంసించారు. సావిత్రిబాయి పూలే ఒక భారతీయ ఉపాధ్యాయురాలు, సామాజిక సంస్కర్త అన్నారు. భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు పూలే అని పేర్కొన్నారు. మహారాష్ట్రలో జ్యోతిబాపూలేతో కలిసి భారత దేశంలో మహిళల హక్కులను మెరుగుపరచడంలో ఆమె కీలకపాత్ర పోషించారన్నారు. ఆమెను భారతదేశ స్త్రీవాద ఉద్యమానికి మార్గదర్శకరాలిగా భావిస్తారన్నారు. హక్కుల కోసం మహిళలు సావిత్రిబాయి పూలే స్ఫూర్తితో పోరాడాలని వారు పిలుపునిచ్చారు.

సావిత్రిబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థినులు